# చె లి మె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com



## ఆవిష్కృతి

ఆమె ఉనికి కోసం
మనుగడ కోసం
కళ్లెం వేసి నియంత్రించిన
కట్టుబాట్ల బంధనాలను
తెంచుకొని
తనను తాను ప్రతినిత్యం
చెక్కుకుంటూనే ఉంది
రెప్పల చాటున
దాగిన స్వప్నాల్ని
సహకారం చేసుకుంటూ
దిగంతాలను ఆవహించిన
శూన్యాన్ని ఛేదిస్తూ
ఖగోళ విస్ఫోటనమై
ప్రకంపిస్తూ
గగనతలానికి బాటలు వేసింది

ఆశయమే ఆలంబనగా
ఆలోచన సాగరమై
ప్రగతి రథ పగ్గాలు
చేతబూని
విజయ బావుటా ఎగురవేసింది
ఆటుపోటుల అగ్ని పరీక్షల
సాములో పునీతమై
అన్నిరంగాల్లో అభినివేశమై
ఆకాశమంతా తానై
తనను తాను సరికొత్తగా
ఆవిష్కరించుకుంటుంది!




**నెల్లుట్ల సునీత**
79894 60657

సర్వ మానవ చైతన్యాన్ని వ్యక్తం చేయటం కోసం, తాత్త్విక, ఆధ్యాత్మిక, మానవత, మౌలిక మూలాల పరిరక్షణ కోసం, ప్రగతిశీల ప్రభావమైన సాహిత్య వికాసం కోసం, దానికి తోడ్పడే భాషాలీలా విలాసాల అవగాహన కోసం, తన జాతి పరంపరాభివృద్ధి కోసం, సమగ్ర ఉజ్వలమైన దీప్తి కోసం అహరహం పరితపించే ఆంతరిక ప్రవృత్తి గల వారు ప్రతి శతాబ్దిలోనూ ఉంటారు. వ్యక్తిగతమైన కష్టనిష్ఠూరాలను, ఆర్థికపరమైన ఒడుదొడుకులకు, సంసారపరమైన అనేకానేక అవరోధాలకు, సంకుచిత మనస్సు కలిగిన వాళ్ల నుంచి నిరంతరం ఎదురయ్యే తీవ్రమైన వ్యతిరేకతలకు ప్రభావితం కాకుండా, ఆత్మశక్తితో, సత్సంకల్పంతో జీవితమంతా సాహిత్య తపస్సు చేసిన గొప్ప రచయితల్లో ఒకరు కోవెల సుప్రసన్నాచార్య.

పితామహులు కోయిల్ కందాడై రంగాచార్యులు, మాతామహులు తంయాల లక్ష్మీనృసింహాచార్యుల శిష్యరికంలో రూపుదిద్దుకొన్న సుప్రసిద్ధ కవి, సాహితీ విమర్శకుడు, వ్యాఖ్యాత, సంపాదకుడు కోవెల సుప్రసన్నాచార్య. సాహిత్య విమర్శపై 18 గ్రంథాలు, 27 కావ్యాలు, అనేక సంకలనాలు ఆయన వెలువరించడం విశేషం. వ్యాకరణ, ఛందో గ్రంథాలను, విమర్శలను, ఖండకావ్యాలను, సాహిత్య చరిత్రను రాసిన ప్రముఖ కవి డాక్టర్ కోవెల సంపత్కుమారాచార్య ఆయనకు చిన్నాన్న కావడం గమనార్హం.

# నిత్య జీవిత గ్రంథం.. కోవెల



**కోవెల సుప్రసన్నాచార్య**

కోవెల సుప్రసన్నాచార్యులు తెలంగాణలోని వరంగల్‌లో 1936 మార్చి 17న వెంకట నరసింహాచార్యులు, లక్ష్మీనరసమ్మ దంపతులకు జన్మించారు. తొమ్మిదేండ్ల వయసులోనే కందపద్యాలు రాయడం ప్రారంభించారు. 1959లో హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి తెలుగు సాహిత్యంలో ఎంఏ పూర్తి చేసి, 1962లో 'రామరాజ భూషణుని కృతులు – పరిశీలన' అనే అంశంపై జరిపిన పరిశోధనకు అదే వర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. అనంతరం ఉస్మానియా, వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయాల్లో వివిధ హోదాల్లో సేవలందించారు. తెలుగు విశ్వవిద్యాలయం ఉన్నత విద్యామండలి సభ్యుడిగా కూడా పని చేశారు. 1987 నుంచి ఆలిండియా ఓరియెంటల్ కాన్ఫరెన్స్‌కు జీవితకాల సభ్యుడిగా ఉన్నారు.

తన సుదీర్ఘమైన కెరీర్‌లో 20 మంది పరిశోధక విద్యార్థులు పీహెచ్‌డీలు, 16 మంది ఎంఫిల్స్‌ను ఆయన మార్గదర్శనంలో పొందారు. వివిధ విశ్వవిద్యాలయాల అకాడమీలు నిర్వహించిన అనేక సెమినార్లలో పాల్గొని తెలుగు సాహిత్యంలో వివిధ అంశాలపై 2 వేలకు పైగా పరిశోధన పత్రాలను ఆయన సమర్పించారు. తెలుగు సాహిత్యాన్ని, సంస్కృతిని సుసంపన్నం చేయడానికి ఆయన చేసిన ఎనలేని కృషిని గుర్తించిన సాహితీ లోకం అనేక అవార్డులతో సత్కరించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి 1987లో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, 1955లో తెలంగాణ అక్షరాస్యత వేదిక వారి ఉత్తమ కవితా పురస్కారం, 1971లో సాహిత్య వివేచన (అక్షరాస్యత విశ్లేషణ) పుస్తకానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ నుంచి ఉత్తమ విమర్శ పురస్కారం, 1997లో తెలుగు వర్సిటీ నుంచి ఉత్తమ పరిశోధక అవార్డు, 2010లో 'అంతరంగం' అనే గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ ఠాగూరు సాహిత్య పురస్కారం, 2013లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి హంస (కళారత్న) పురస్కారం, 2016లో తెలంగాణ ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ పురస్కారం తదితర అవార్డులు ఆయనను వరించాయి.

కోవెల సుప్రసన్నాచార్య కవితల్లో కొన్నిటిని ఆంగ్లం, హిందీ భాషలలోకి పలువురు సాహితీవేత్తలు అనువదించడంతో అవి ఆయా భాషల్లో ప్రచురితమయ్యాయి. ఆయన రచనలపై విమర్శకులు, రిసెర్చ్ స్కాలర్స్, సాహితీవేత్తలు అనేక పుస్తకాలు ప్రచురించారు. ఉదాహరణకు 'ప్రసన్న శారద' (60వ జన్మదిన సంపుటి), 'సుప్రసన్న సాహితీ వైజయంతి' పుస్తకాలు ఆ



కోవలోనివే. ఆయన 80వ జన్మదినం సందర్భంగా 'సన్నుతి' పేరిట ప్రత్యేక సంచికను ఆయన శిష్యులు, అభిమానులు వెలువరించారు. ఇప్పటికీ ఆయన రచనలపై వివిధ విశ్వవిద్యాలయాల్లో ఎంఫిల్స్, పీహెచ్‌డీల కోసం పరిశోధనలు కొనసాగుతున్నాయి.

వ్యక్తిత్వం వికసించే దశలో ఉండగానే ఆర్యసమాజ్ ఉద్యమాలతో ఆయన ప్రభావితుడయ్యారు. ఏ ఉద్యమంలోనూ ఆయన ప్రత్యక్షంగా పాల్గొనలేదు. కానీ, దేశంలోని సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, ఆధ్యాత్మిక ధోరణులను గమనించడం ద్వారా తన జీవిత దృక్పథాన్ని లోతుగా మలుచుకున్నారు. శ్రీరామకృష్ణులు, స్వామి వివేకానంద, శ్రీఅరవిందులు, గాంధీజీ తదితర ప్రముఖుల రచనలు ఆయనలో చైతన్యాన్ని రగిలించి, ప్రభావితం చేసి.. జాతి నిర్మాణంలో నిబద్ధతతో కూడిన దార్శనిక కవి, విమర్శకుడిగా, రచయితగా ఎదగడానికి దోహదపడ్డాయి. ఒకానొక దశలో మార్క్సిస్టు భావజాలం, వామపక్ష ఉద్యమాల ప్రభావానికి ఆయన లోనయ్యారు. కానీ, అరవిందులు, విశ్వనాథ సత్యనారాయణల స్ఫూర్తి, రచనలు ఆయనలోని చైతన్యాన్ని చుట్టుముట్టి దార్శనికత కలిగిన గొప్ప రచయితగా మార్చాయి. 'శతాంకురలో నా కవితలు నూతన యుగానికి ఆధార భూమికలు' అని ఆయన పేర్కొన్నారు. తన కవిత్వం సమకాలీన కాలం నుంచి ప్రేరణ పొంది శాశ్వత విలువలను ప్రచారం చేసి భవిష్యత్తును చూస్తుందని దాని భావం.


> జాతీయత, ప్రజాస్వామ్యం, సంప్రదాయ విలువలు, ఆధ్యాత్మిక స్ఫూర్తిని ఆయన ప్రచారం చేశారు. ఆయన దృష్టిలో మతం అంతిమ విషయం కాదు, మానవ పురోగతి సాధనలో అది ఒక మైలురాయి మాత్రమే. అంతిమ సత్యాన్ని సాధించడానికి మానవుడు మతతత్వాలకు పరిమితం కాకూడదు. మత సిద్ధాంతాల తాత్త్విక కట్టుబాట్లు, సిద్ధాంతాల అడ్డంకులను నాశనం చేయడం ద్వారా మనిషి ఎదగాలి. మానవాళి, ప్రకృతి, జంతువులు, విశ్వం పట్ల తన ప్రేమను మానవుడు విస్తరించాలని ఆయన స్పష్టంగా సూచిస్తారు.

ఈ ప్రక్రియలో తన పరిమితులను, స్వార్థాన్ని, బలహీనతలను జయించిన మానవుడు అంతిమంగా సమాజాన్ని, ప్రకృతిని, విశ్వాన్ని ఆలింగనం చేసుకుని అందరితో ఏకమవుతాడు. సుప్రసన్న కవితా రచనలన్నిటికీ జీవితం కేవలం భౌతిక అస్తిత్వం కాదు. అదొక సమగ్ర జీవనం. జీవితం ఒక నిత్య గ్రంథం అని శతాంకురలో ఆయన చెప్పారు.

రచనలన్నింటిలోనూ తనదైన భావ వ్యక్తీకరణ పద్ధతిని ఆయన పెంపొందించుకున్నారు. ప్రతి కవితా రచనలో భాష, శైలి, ఛందస్సు వంటి పద్ధతులను అవలంబించారు. ఆయన కవిత్వం ద్వారా పాఠకుడు గొప్పదనాన్ని, లోతైన అనుభవాన్ని, ఊహాశక్తిని అనుభూతి చెందగలడు. సుప్రసన్న కవిత్వానికి మానవ జీవితం సామాన్య సమీకరణం కాదు. ఇది ప్రతి వ్యక్తి తన సొంత మార్గంలో చేయవలసిన సంక్లిష్టమైన శాశ్వత ప్రయాణం. అందుకే ఆయనకు 'జీవితమే నా జెండా'. మనిషి జీవితాన్ని పట్టుదలతో పూర్తిగా అనుభవించి, ఎలాంటి అవాంతరాలు లేకుండా పట్టుదలతో ఉండాలి. ఈ గొప్ప సత్యమే ఆయన మొత్తం సాహిత్య రచనలకు మూలం. అందుకే ఆయన కవితలలో జీవితం వెల్లివిరుస్తుంది. ఆయన కవిత్వం జీవిత పరిపూర్ణతను, ప్రకాశవంతమైన ఆత్మకు సంబంధించిన లోతైన భావాల అన్వేషణ, వేడుక. ఆయన కవిత్వం ఇంద్రియానుభూతికి అతీతంగా కొత్త పరిధులను తెరుస్తుంది.



**సాయి లోహిత పులపా**



## ఔషధ వృక్షం

అతడు తన గాయాలకు
ఆమెను ఔషధ వృక్షంగా
హృదయంలో నాటుకున్నాడు

ఆమెకు మొలిచాక తెలిసింది
ఓ కథకి పునాదినని
ఓ కలకు తీపి నిద్రనని..

కానీ ఓ అబద్ధంలా ఈ నిజం
కాలంతో యుద్ధం చేస్తున్నా

ఆమే రాత్రి అతడికి
అతడే పగలు ఆమెకు

ఏ కలకు జత కూడని నిజంతో
క్షణమాగని వీరి ప్రయాణంలో

అతడు ఎంత నడిచినా
ఆమె దూరమే
ఆమె ఎంత దూరంగా ఉన్నా
అతడు దగ్గరే


ఇదే లోతుగా
జీవనదిలా ప్రవహించే
ఇష్టం ఒడ్డున

ఒంటరిగా
ఎవరికి వారే
ఇంకొకరి వైపు పొంగుతుంటారు!

**- చందలూరి నారాయణరావు**
97044 37247

> తన కలంతో, గళంతో ఏకకాలంలో అంటరానితనంపై పోరు సలిపిన తొలి తరం దళిత కవి కుసుమ ధర్మన్న. సంఘసంస్కరణ అభిలాష కలిగిన ఆయన అంబేద్కర్ నుంచి స్ఫూర్తి పొందారు. కందుకూరి వీరేశలింగం ద్వారా ప్రభావితమయ్యారు. 'మాకొద్దీ నల్ల దొరతనం' అంటూ నినదించిన ఆయన జాతిని మేల్కొల్పే దిశగా ఎన్నో రచనలు చేశారు. నిమ్న జాతి ముక్తి తరంగిణి, నల్ల దొరతనం, హరిజన శతకం వంటివి ఆయన కలం నుంచి జాలువారినవే.

# మాకొద్దీ నల్ల దొరతనం




ప్రముఖ సాహిత్య కేంద్రమైన రాజమహేంద్రవరమే కుసుమ ధర్మన్న స్వస్థలం. కుసుమ నాగమ్మ, వీరస్వామి దంపతులకు 1900 మార్చి 17న ధర్మన్న జన్మించారు. జాతీయోద్యమ కాలంలో దళితుల కోసం పాలికేక వేసిన ధీశాలి కుసుమ ధర్మన్న. తన జీవితాన్ని ఇటు దేశానికి, అటు దళిత జాతికి అంకితం చేసిన ధర్మన్న 45 ఏండ్లకే దివికెగిశారు. సాంఘిక, సాంస్కృతిక, సాహితీ రంగాలపై కుసుమ ధర్మన్న వేసిన ముద్ర సామాన్యమైనది కాదు. బహుముఖీనమైన ధర్మన్న ప్రతిభ ప్రధానంగా ఐదు మార్గాల్లో విస్తరించింది. వైద్యరంగం, సాహిత్య సృజన, కళారంగం, పత్రిక నిర్వహణ, వక్తృత్వం. వీటితో ధర్మన్న ఆనాటి ఆంధ్రా సమాజాన్ని, ముఖ్యంగా దళిత జాతిని ఉత్తేజపరిచారు. పేద దళితులకు సేవ చేసిన ఆయన ప్రజా వైద్యుడిగానూ పేరొందారు. ఆధునిక ప్రజా వాగ్గేయకారుడైన ధర్మన్న తొలి రోజుల్లో గాంధీ సిద్ధాంతాలకు ఆకర్షితులయ్యారు. అనంతరం దళిత జాతి విముక్తి కోసం అంబేద్కర్ బాటలో నడిచారు. ఆయన సిద్ధాంతాలను ప్రచారం చేశారు. ఈ క్రమంలోనే జయభేరి పత్రికను స్థాపించి తొలి దళిత సంపాదకుడిగా గుర్తింపు పొందారు. అనేక అఖిలాంధ్ర మహాసభల్లో పాల్గొన్న ధర్మన్న ఆలోచనాత్మక, ఉద్వేగపూరిత ప్రసంగాలతో ఎందరినో ఉద్యమం వైపు నడిపించారు.

ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో కవిగా, రచయితగా కుసుమ ధర్మన్న స్థానం అద్వితీయమైనది. దళిత పోరాట చరిత్రలోనూ ఆయనకు ఆయనే సాటి. అందుకే ధర్మన్న ఆశయాలను, ఆలోచనలను, ఉద్యమ స్ఫూర్తిని, సామాజిక సేవను, సమతావాదాన్ని నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉన్నది. తన రచనల రూపంలో దళిత జాతి సంరక్షకుడిగా ధర్మన్న ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతారనడంలో ఎటువంటి సందేహం లేదు.



**దేవులపల్లి రమేశ్**
99637 01294

## ఆహ్వానం

### సాహిత్య సభలు

**హైదరాబాద్‌లోని** బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల 24న తెలంగాణ రచయితల సంఘం జంట నగరాలు ఆధ్వర్యంలో సాహిత్య సభలు నిర్వహిస్తున్నారు. మూడు విభాగాలుగా జరుగనున్న ఈ సభలను సాహితీవేత్త కె.శ్రీనివాస్ ప్రారంభిస్తారు. విశిష్ట అతిథులుగా నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్, ఆత్మీయ అతిథులుగా నాళేశ్వరం శంకరం, విరాహత్ అలీ పాల్గొని ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమంలో కవి కందుకూరి శ్రీరాములు రాసిన 'పలకల నుంచి పలుకుల వైపు' కవితా సంపుటిని ముఖ్య అతిథి శివారెడ్డి ఆవిష్కరిస్తారు. వివిధ జిల్లా శాఖల తెరసం అధ్యక్షులు కొత్త అనిల్ కుమార్, పొట్లపల్లి శ్రీనివాస్, బిల్లా మహేందర్, పానుగంటి రామ్మూర్తి, ముత్తిగారి కవిత, పొన్నాల బాలయ్య, గణపురం దేవేందర్, కొండపల్లి నీహారిణి, బెల్లంకొండ సంపత్ కుమార్ తదితరులు పాల్గొంటారు.

### పుస్తకావిష్కరణ

**హైదరాబాద్‌లోని** రవీంద్రభారతిలో తెలంగాణ సాహిత్య అకాడమీ ముద్రించిన 'తెలంగాణ సాంస్కృతిక పదకోశం (పండుగలు, జాతరలు)' పుస్తకావిష్కరణ సభ ఈ నెల 20న సాయంత్రం 5 గంటలకు జరగనున్నది. ఈ మేరకు తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.నామోజు బాలాచారి తెలిపారు.

### ప్రపంచ కవితా దినోత్సవం

**కవిసంధ్య,** భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఈ నెల 24న సాయంత్రం 5.30 గంటలకు రవీంద్ర భారతి సమావేశ మందిరంలో ప్రపంచ కవితా దినోత్సవం జరుగనున్నది. ఈ సందర్భంగా కవిత్వంపై కొప్పర్తి ప్రసంగం, బహుమతుల ప్రదానం, కవి సంధ్యపత్రిక, కవిత్వ గ్రంథాల ఆవిష్కరణ, కవి సమ్మేళనం తదితర కార్యక్రమాలు ఉంటాయి. శిఖామణి అధ్యక్షతన జరిగే ఈ సభలో కొలకలూరి ఇనాక్, కె.శివారెడ్డి, మామిడి హరికృష్ణ, శీలాసు భద్రాదేవి, సుధామ, ఆంజనేయ శర్మ, సీఎస్ రాంబాబు, చల్లా రామఫణి పాల్గొంటారని కవి సంధ్య ఉపాధ్యక్షులు దాట్ల దేవదానం రాజు వెల్లడించారు.

# మన బతుకు చిత్రమే.. తెలంగాణ సిన్మా

తెలంగాణ, తెలుగు సినిమా ఇప్పుడు తన అస్తిత్వాన్ని జల్లెడ పట్టుకుంటూ.. కొంగును ముడికట్టుకుంటూ, ఎనను ఎగదోసుకుంటూ మెయిన్‌స్ట్రీమ్ సినిమాగా ముందుకు రావాలని అనేక ప్రయత్నాలు చేస్తున్నది. తన స్పేస్ తాను తీసుకుని, తన పరిధులు విస్తరించుకుంటూ వెండితెరను కమ్ముకుంటూ.. చిమ్ముకుంటూ వినిర్మాణమవుతూ దక్షిణాది సినిమా దూసుకుంటూ పోతున్నది.

> డిజిటల్ మార్కెటింగ్ విపణిలో రెక్కలు విప్పుకొంటున్నదంతా ఇక కొత్త సినిమా కాలం. తారల కాంబినేషన్ మాయాజాలం ఇప్పుడు పని చేయడం లేదు. కంటెంటే మాయాజాలాన్ని రీకంపోజ్ చేస్తూ ముందుకు తీసుకుపోతున్నది. హీరో ఇప్పుడు మెటా హీరో అయిపోయాడు. విలన్ కూడా మెటా విలన్ స్థానాన్ని ఆక్రమిస్తున్నాడు. ప్రేక్షకుడి చేతుల్లోకి పగ్గాలొచ్చేశాయి. సినిమా ఇప్పుడు ప్రేక్షకుని మన్ననలోనే కండ్లు తెరుచుకుని విజయాలు చవిచూస్తున్నది.

ఒక సినిమా విజయానికి మరో సినిమా విజయానికి మధ్య పోలికే ఉండటం లేదు. ఒక హీరో విజయ రహస్యం, ఆ సినిమాతోనే లాక్ అయ్యి తలుపులు మూసుకుపోతున్నాయి. అయినా హీరో తన ఆకృతిని పెంచుకుంటూ భాషాంతరాల అగాధాలను, పురా అగాధాలను సమం చేస్తూ, ప్రేక్షకుడు తనతో కాంటాక్ట్‌లో ఉండేట్టుగా చూసుకుంటూ.. వెనక్కి, ముందుకూ, పైకి విస్తృతమవుతున్నాడు. తెర ప్రసంగాలు కేవలం సామాజిక రాజకీయ అంతరాలను ఎగదోస్తున్నాయి. కానీ, అంతరంగంలోని మనిషిని మాట్లాడించలేకపోతున్నాయి. అందుకే మన సినిమాల్లో చర్యలు మాత్రమే ప్రేక్షకుడిని నమ్మించగలుగుతున్నాయి. చర్యల తాలూకు భాషనే ప్రేక్షకుడిప్పుడు అర్థం చేసుకోగలుగుతున్నాడు. అటువంటి చర్యల రంగస్థలానికే ప్రేక్షకుడు పట్టం కడుతున్నాడు. అనివార్యంగా సినిమా ఇప్పుడు సృజనకు రంగస్థలమే కాకుండా రణస్థలంగా మారిపోయి చాలా వేగంగా పనిముట్లను మార్చుకునేలా దర్శక, రచయిత, సాంకేతిక కళాకారులను సిద్ధపడేలాగా తయారు చేస్తున్నది. ప్రతి పాత్ర కొత్త ఊపిరితో తొణికిసలాడితే తప్ప జీవ ప్రవేశం జరగడం లేదు. ప్రేక్షకుల ఆదరణ లభించడం లేదు. దర్శక నిర్మాతలకు ఇప్పుడు ప్రతి సినిమా ఒక వార్ క్రై.. ఒక ఎన్నికల గెలుపోటముల ప్రకటన. తెలుగు, తెలంగాణ సిన్మా సృజనకారుల కొత్త మ్యానిఫెస్టో ఇప్పటి సినిమా.

> The harrowing experience has left him haunted by the past and fearless in the present
> *- Peaky Blinders*



> చాలావరకు సినిమాలన్నీ గతాన్ని వాస్తవంగా, ఆర్గానిక్‌గా, మల్టిపుల్ నెరేటివ్స్‌గా ప్రేక్షకుల వీక్షణం కోసం దూసుకువస్తున్నవే. గతంలోని చారిత్రక ఖాళీలను పూరించడానికి వస్తున్న వర్తమానమే ఇప్పటి సినిమా. గతంలోని మన బాల్యం, మన కుటుంబాల వివిధ రూపాల నీడలు, పాత్రల చుట్టూ బలమైన మానసిక సంక్షోభాలు, వాటి రంగులూ, పొంగులూ మన మెటా హీరో చుట్టూ వలయాకారంలో తిరుగుతూనే ఉంటాయి. వాటి మధ్యలో నిలబడి మన హీరో ఇటువంటి మల్టిపుల్ నెరేటివ్ స్టైల్‌తో, జీవభాషతో, అరమరిక లేని మానవ సంబంధాల నెనరుతో, రక్తప్రసరణతో.. దిగువ మధ్యతరగతి జీవితాన్ని ప్రేక్షకుడికి పట్టివ్వడానికి వస్తున్న ఈ తరం తెలుగు సిన్మా.. 'షరతులు వర్తిస్తాయి'.

అయితే ఈ సినిమా నిర్మాణంలో దర్శకుడు కుమారస్వామి (అక్షర) ఎదురుకున్న అనేకానేక అనుభవాలు, ప్రతిబంధకాలు, ఊహించకుండా ఎదురైన సవాళ్లూ, ప్రతిష్టంభనలూ ఎన్నెన్నో. వాటిని తెలుసుకోవడానికి తనతో తన ఫస్ట్ పర్సన్ నెరేటివ్‌ను గుండె ఆనించి వింటే.. సినిమా రూపకల్పనలో, నిర్మాణంలో ఉండే కష్టనిష్ఠూరాలు, క్రియేటివ్ రంగంలో ఉండే వాస్తవిక సూత్రాలు తెలుస్తాయేమో!

'తెలంగాణ, చిన్న సినిమాలు మనకేమీ అంత దగ్గరగా లేవు. ఈ మాటలు వినగానే కొత్త తరం, యువ దర్శకులకు నిరాశ కలుగుతుంది. షరతులు వర్తిస్తాయి కథ నా జీవితంలో జరిగినదే. నా చుట్టూ ఉన్న మనుషులనే పాత్రలుగా మార్చి అల్లిన కథ ఇది. కథనంలోని పాత్రలన్నీ కరీంనగర్ జీవభాషతో, బతుకు తాలూకు స్వభావంతో, అన్నం మెతుకులను చింతతొక్కు కారంతో కలుపుకొని తిన్నంత అలవోకగా.. కష్టాలను, నమ్మకాలను, పగటి కలలను కలుపుకొంటూ, తింటూ జీవన పోరాటాన్ని ఎదుర్కొంటుంటాయి. అపజయాలను కూడా మూటగట్టుకుంటూ ఉంటాయి. అందుకే అవి కథనంలోని సరిహద్దు రేఖలను దాటలేకపోయాయి. ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేటట్టు సిన్మా తీయాలి. అప్పుడే మనం నిర్మాతలకు, ప్రేక్షకులకు మధ్య వారధిగా ఉండి మంచి సిన్మా తీసిన దర్శకుడిగా మనగలుగుతాం. మధ్య తరగతి ఒడుదొడుకులను తెలంగాణ వ్యక్తీకరణతో, భావోద్వేగాల మూటతో సజీవంగా తెరమీదికి, అందులోనూ మెయిన్‌స్ట్రీమ్ ఎనర్జీతో వచ్చిన తెలంగాణ సిన్మా షరతులు వర్తిస్తాయి. తెలంగాణ సిన్మాను ప్రేక్షక దేవుళ్లు ఆదరిస్తారని నమ్మకంతో ఉన్నా' అని ఈ సినిమా దర్శకుడు అంటున్నారు. వైవిధ్య కథనాన్ని తెరమీదికి తెస్తున్న కొత్త దర్శకుడిని ఆశీర్వదిద్దాం. మన తెలంగాణ సిన్మాను బతకనిద్దాం.



**కవి సిద్ధార్థ**



## నీ జ్ఞాపకం నిత్యవసంతం

ఆటపాటల పదకొండేళ్ల బాల్యాన్ని
దాటి
సంక్లిష్టమైన బాల్య, తరుణాల
జుగల్ బందీ కచేరీ అయిన
పన్నెండేళ్లనూ దాటేసి
నన్ను నే నర్థం చేసుకుంటూ
నా జీవనగీతాన్ని శృతి
చేసుకుంటున్నప్పుడు
దూరాల నుంచి విచ్చేసిన నీవు
మలయసమీరసఖులతో కలిసి
నా ప్రాంగణంలో చొరవగా
ప్రవేశించావు!
పట్టపగలే మరో ఉదయం వలె
నీ బంగారు రూపంతో కాంతిని
ప్రసరించావు!
అపరిచితురాలివైనా
ఎంతో పరిచయమున్నట్లే
కోటిమెరుపుల కలగలుపైన
నీ నీలనయనానుగ్రహకాంతిని
నాపై పరిచి పలుకరించావు!
ఏ అమ్మాయిల చూపులను
పట్టించుకోని నా పెంకెతనాన్ని
తృటిలో బద్దలు కొట్టేశావు!

క్షణంక్షణం నాకు అందాల కలలను
ప్రసాదించావు!
నా ఊహల్లోనూ, భావాల్లోనూ,
ఆలోచనల్లోనూ కొత్త వెలుగులు
నింపావు!
నా ప్రతి ఆశయానికీ ఆత్మగ
నిలిచావు!
నేను చేసే ప్రతిపనికీ ప్రేరణ
వయ్యావు!
నా మనోరాజ్యాన్ని నీ ఆధీనం
లోకి తీసుకున్నావు!
నీ మాటని నా పాటగ చేశావు!
కానీ ఆశ్చర్యంగా నీ సొంత
సామ్రాజ్యానికి ఉలుకూ
పలుకూ లేక వెళ్లిపోయావు!
ఏదేమైనా నీ సన్నిధిలోని
ప్రతిక్షణం అపురూప జ్ఞాపకమైంది!
నీ ఆత్మీయనామస్మరణే
నా జీవితంలో నిత్యవసంతం!



**రఘువర్మ (టీయల్యన్)**
92900 93933